# మజిలీలు – గమ్యాలు

– పి. శివరామకృష్ణ (శక్తి)
www.sakti.in

కవిత్వాలు, సిద్ధాంతాలు, పరిశోధనలు, పోరాటాలు, చర్చలు ఇవన్నీ మజిలీలు కాని గమ్యాలు కావు. 'మూడుకాలాలకు లంకె కలిపిన సాహిత్యంలో వాస్తవ చిత్రణ ఎంత చిక్కనైందో కాల్పనికత అంత గాఢమైంది. ఇదే విప్లవ కాల్పనికత' అంటారు. 'అడవివెన్నెల' (1985) కథా సంకలనంలో ముందుమాట 'వేడి వెన్నెల'లో కె.వి.ఆర్. (కె.వి. రమణారెడ్డి) మరోముందుమాట 'గిరిజనులు – గిరిజన సంస్కృతి'లో బాలగోపాల్ 'ఇవేళ కొందరు దోపిడీదారుల ఆస్థిగా ఉన్న విజ్ఞానం అందరి సంపదకావాలి' 'ఆ సంపద ప్రాతిపదికగా కొందరు సంపన్నుల సమాజం కాక మొత్తంగా సమాజం సంపన్నం కావాలి' (పుట. 12) అని ఆశిస్తారు. కాని కొద్దో గొప్పో ఆజ్ఞానాన్ని ప్రజల బుర్రలోకెక్కించాలి. ఆ 'విజ్ఞానం' అంటే విషయపరిజ్ఞానంకోసం సిద్ధాంతాలు వల్లెవేస్తూ, పాటలుపాడుతుంటే సరిపోదు, ఈ వ్యవస్థలో ఎక్కేగడప, దిగేగడప తిరగాలి.

**అనుకున్న కూలీ – చిత్రగుప్తుడి లెక్కలు – సర్కారు కూలీ:**

ఈ సంకలనంలో సుప్రసిద్ధమైన కథ 'రక్తపింజెర' గిరిజన ప్రాంతాలలో కూలీసమస్య. ఈ కూలీలో 'అనుకున్న కూలీ', 'చిత్రగుప్తుడి లెక్కలు', 'సర్కారు కూలీ' అనే మూడు దశలున్నాయి. ఈ సర్కారు కూలీ ఏమిటో అర్థం చేసుకోవడానికి రాజమండ్రి దానవాయిపేటలో లేబర్ ఆఫీసు వెళ్ళాను(1990) అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్ సూర్యప్రసాద్ రకరకాల పనులకు ప్రభుత్వం కూలీ నిర్ణయించే దశలను వివరిస్తూ వెదురు కలపపనుల్లో 1982లో నిర్ణయించిన కనీసవేతనానికి 1987లో సవరణ ప్రతిపాదిస్తూ ముసాయిదా అందరికీ పంపారనీ – ఆరు నెలలలోపలే తుది ప్రకటన వెలువడాలి కాని ఇంకా రాలేదు అని వివరించారు. ఆ ముసాయిదా అందుకున్న జాబితాలో అన్ని కార్మికసంఘాలు, సంబంధించిన ప్రభుత్వశాఖలు ఉన్నాయి. హైదరాబాదు లేబర్ కమీషనర్ ఆఫీసులోకూడా అదే సమాధానం. గిరిజన ప్రాంతాల్లో నక్సలైట్లతో పోరాడే ప్రభుత్వం కూలీరేట్లు నిర్ణయించడంలో మాత్రం ఇలా నిద్రబోతూ ఉంటుంది.

సాయంత్రం హైకోర్టు న్యాయవాది శ్రీరామలింగేశ్వరరావుతో కేసు వేయాలని కాదు – నా అన్వేషణ అంతా వివరించాను. వెంటనే ఆయన కనీసవేతనచట్టం(1948) చూసి 'ఐదేళ్ళకోసారి కనీసవేతనం సవరించవలసిందే ఇలా పెండింగ్ పెట్టకూడదు' అంటూ కేసువేశారు. ఆరు నెలల్లోపలే ప్రభుత్వం తుదిప్రకటన వెలువరించి కోర్టులో దాఖలు చేసింది (రిట్‌పిటిషన్ 5033/90, 14398/91 ఉత్తర్వు తేదీ:13–3–2002). పేపరుమిల్లులు, కాంట్రాక్టర్లు, అటవీశాఖలు వేసే చిత్రగుప్తుడి లెక్కలగుట్టు విప్పుదామని నాటి రంపచోడవరం సబ్‌కలెక్టర్, నేటి హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనీరబ్‌ప్రసాద్‌ను కదిలించాను. కూలీలెక్కల జాబితా పంపించవలసిందిగా వారందరికీ ఉత్తరం వ్రాసి తెప్పించారు. ఆ ఫైల్ నా అభిప్రాయం కోసం పంపారు. వారు పేర్కొనవన్నీ వివిధ నక్సలైట్‌వర్గాలతో కుదుర్చుకున్న కూలీరేట్లు. ఇవి కనీసవేతనం కంటే తక్కువగా ఉన్నాయని లెక్కలేస్తూ 'కూలీలు – ఒప్పందాలు – బాధ్యతలు' అనే కరపత్రం పంచిపెట్టాం. 1987లో గుర్తేడులో ఐ.ఎ.యస్. అధికారుల నిర్బంధం తరువాత వార్తలకు గిరాకీ పెరిగింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభవిలేఖరిగా విజయవాడనుండి వై.యస్.రావ్‌ను రాజమండ్రికి బదిలీ చేశారు. ఆయన 1992లో మళ్ళీ విజయవాడ వెళ్ళేదాకా మేం పంపే వార్తలను, వ్యాఖ్యలను యధాతథంగా పంపేవారు. చాలా వార్తలు దేశవ్యాప్తంగా అన్ని ఎడిషన్లో వచ్చేవి. లోకాయన్, సోషల్‌ఎక్షన్ వంటి సామాజిక శాస్త్రవేత్తల పత్రికలలోకూడా వ్యాసాలు వ్రాశాం. కాని పరిశోధకులు, పౌరహక్కులసంఘాలు ఈ వార్తలపట్ల ఆసక్తి చూపించకపోవడం విచిత్రంగా ఉండేది.

**మండలాలమధ్య చీలిపోయిన గిరిజనగ్రామాలు:**

కాకతీయవిశ్వవిద్యాలయంలో ఆచార్యుడు స్వర్గీయ బి. జనార్దనరావు వరంగల్‌జిల్లాలో గిరిజనుల భూముల అన్యాక్రాంతంమీద తన సిద్ధాంతగ్రంథంలో, ఏటూరు నాగారం ఫిర్కాలో 23 గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతం కిందకురావు అని హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు వ్రాశారు. అప్పుడు అక్కడ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న నీరబ్, ఏదో పనిమీద రంపచోడవరం వచ్చినప్పుడు, ఈ

విషయం ప్రస్తావించాను. ఆయన 'అవును, 20 యేళ్ళముందుకథ ఇప్పుడు మేం అప్పీల్ వేస్తే, ఇంతకాలం ఏం చేస్తున్నారని సుప్రీంకోర్టు ఈ కేసును స్వీకరించకపోవచ్చు, మీరే ఏదో ఒకటి చేయండి' అని ఆ కాగితాలన్నీ ఇచ్చారు. గిరిజన సంక్షేమశాఖ వారు ఏం చేస్తున్నారో ఆరాతీస్తే వారు రాష్ట్రం మొత్తంమీద 800 గ్రామాలను గిరిజనప్రాంతాలలో కలపదగినవిగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని చెప్పి, ఆ దస్త్రం ముందు పడేశారు. వాటిలో పై 23 గ్రామాలుకూడా ఉన్నాయి.

'గిరిజన గ్రామాలన్నీ ఏజెన్సీలో ఉన్నా, వెలుపలున్నా గిరిజనాభివృద్ధిసంస్థ పరిపాలనలోకి తీసుకురావడానికి ఏఏ తాలూకా/ జిల్లాలలో కలిపితే బాగుంటుంది అని అడిగితే కొత్తగా షెడ్యూల్డు ఏరియాలోకి రాదగిన గ్రామాల జాబితా పంపారు. దీనికి న్యాయ, ప్రణాళికశాఖల అనుమతి పొందాలి, మండలాలవారీగా సరిచేసి పంపండి' అంటూ కేంద్రం తిప్పి పంపిన కాగితాలుకూడా దాంట్లో ఉన్నాయి. స్వతంత్రం వచ్చాక ఏజెన్సీప్రాంతంనుండి కొన్ని గిరిజన గ్రామాలను తొలగించారేకాని కొత్తగా కలపలేదు. ఈ కొత్తగా గుర్తించడం ఎప్పటికి జరుగుతుందో! ఏజెన్సీ వెలుపల ఒకచోట వరుసగా 40, 50 గిరిజనగ్రామాలుంటే వాటిని రెండుమూడు మండలాల్లోకి విడదీశారు. అలా విడిపోయిన 47 గ్రామాలకు తూర్పుగోదావరి జిల్లాలో పెద్దమల్లాపురం కేంద్రంగా ఒక మండలం ఏర్పాటు చేయాలంటూ సమత రవి ప్రతిపాదించేవాడు. పాలనా సౌకర్యంతోపాటు, గిరిజనులు ఒక వోట్‌బాంక్‌గా ఏర్పడడానికి ఈ పునర్విభజన అవసరం అంటూ 800 గ్రామాల వివరాలతో 'మండలాల విభజనలో ముక్క చెక్కలైన గిరిజనగ్రామాలు' అనే పుస్తకం ప్రచురించి అందరికీ పంచాము (1989). నిజానికి ఇటువంటి ప్రతిపాదనలు 1920నుండి ప్రభుత్వానికి వెళుతూనే ఉన్నాయి. ఉదాహరణకు మఠంభీమవరం చుట్టూ కొన్ని గ్రామాలు విశాఖజిల్లా చింతపల్లి తాలూకాలో (ఇప్పుడు చింతపల్లి మండలం) ఉన్నాయి. అధికారులు ఆ గ్రామాలకు వెళ్ళాలంటే తూర్పుగోదావరిలో రంపచోడవరం వచ్చి వెళ్ళాలి. అంటే నాలుగైదువందల కి.మీ. ప్రయాణం చేయాలి. కాబట్టి 'ఆ గ్రామాలు తూర్పుగోదావరిలో కలపండి మహాప్రభో!' అని జిల్లా కలెక్టర్లు చిరకాలంగా మొత్తుకుంటున్నా ప్రభుత్వంలో కదలికలేదు.

ఆ మధ్య 'కల్యాణపులోవ' అజయ్‌కుమార్ 800 గ్రామాలు ఏజెన్సీలో చేరాలనే ప్రతిపాదనలు ఎప్పటినుండో కేంద్రంలో నానుతున్నాయి వాటిని కదిలించాలంటూ పాదయాత్రలు, ధర్నాలు చేశాడు. మండలాల పునర్విభజన రాష్ట్రస్థాయిలో సాధ్యమయ్యే నిర్ణయం. ఇంటగెలిచి రచ్చగెలవమన్నట్లు ముందు మండలస్థాయిలో పునర్విభజన కొన్నిచోట్లన్నా జరిగితే ఉద్యమానికి ఊపువస్తుంది. మండల, పంచాయతీ ఎన్నికలలో ఈ సమస్యమీద గిరిజనులను కూడగట్టవచ్చు. దశలవారీగా కాకుండా 'ఒకరాయి వేసి చూద్దాం' అని చేసే ఉద్యమాలు ప్రజలను మరింత నిరాశపరుస్తాయి. ఏమైనా, అజయ్ ఈ సమస్యను ప్రజలు మరిచిపోకుండా తనకు తోచిన ప్రయత్నం చేశాడు.

ఆచార్య జనార్దనరావు ఒకసారి ఎందుకో రంపచోడవరం వచ్చారు. ఆయన అనర్గళంగా ఉపన్యసించేవారు. చాలా మంది గిరిజన విద్యార్థులచేత పరిశోధనలు చేయించాడు. వామపక్ష ఉద్యమాలలో ఆయన ఎప్పుడూ ప్రధానవక్త. 'ఏటూరు నాగారం విషయం ఏంచేశారు. ఎవరితోనన్నా సుప్రీంకోర్టులో వేయించాలి గదా' అని అడుగుతూ ఈ పరిశోధనలవల్ల గిరిజనులకు భూములు సంపాదించుకునే తెలివితేటలు వస్తాయా!' అని ప్రశ్నించాను. ఆయన, బాలగోపాల్ ఖమ్మంజిల్లాలో పర్యటించి (1998)లో అక్కడి భూపోరాటం మీద వ్యాసం వ్రాశారు. నైజాంలోని ఖమ్మంజిల్లాలో భూమిపటాలు, ఆంధ్రలో పటాలకు కొద్దితేడా ఉంటుంది. ఈ పోరాటంలో పాల్గొనే గిరిజనులకు ఆ తేడా అర్థం చేసుకోవడానికి ఇబ్రహీంపట్నంలో ఉద్యమాలు నిర్వహించిన (1990) గీతారామస్వామి కార్యకర్తలతో శిక్షణనిప్పించాం. 1980 నుండి ఎదిగిన ఆం.ప్ర. వ్యవసాయకూలీసంఘం, 2000 తరువాత మెత్తబడినా, దాంట్లో ముఖ్య కార్యకర్తలకు భూసమస్యలపట్ల కొంత అవగాహన ఉంది.

మేం భూమిసర్వేలో గిరిజనులకు శిక్షణ ఇస్తున్నట్లు హిందూలో పడిన వార్త (*Tribals trained in land survey, April6, 1999*) చాలా మందిలో ఆసక్తి పెంచింది. వేమన వసంతలక్ష్మి 'పశ్చిమ గోదావరి గిరిజనుల భూమి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ ఉత్తర్వులు – కోర్టు తీర్పులు' అనువదించి అచ్చువేయించి మాకందించారు. 'భూమి సర్వేలో శిక్షణ' అనే మా పుస్తకాన్ని దిద్దడంతో పాటు కార్టూనిస్టు మోహన్ చేత బొమ్మలు వేయించారు. 'శంషాబాద్ విమానాశ్రయం భూనిర్వాసితుల సమస్య అధ్యయనం చేసేటప్పుడు ఈ పుస్తకంలో ఇచ్చిన పదాలను ప్రజలు తమ యాసలో పదే పదే వల్లెవేస్తుండేవారు. వారి ఆ మాటలు అర్థం చేసుకోడానికి ఈ చిత్తుప్రతి చాలా ఉపయోగపడింది' అని చెప్పారు.

కల్పనాకన్నబిరాన్ మమ్మల్ని పట్టుకొని పదిరోజులు గిరిజన గ్రామాలు తిరిగి భూపోరాటంలో ఎదుగుతున్న గిరిజనమహిళా నాయకత్వంమీద రిపోర్ట్ తయారు చేశారు. 'అస్మిత'లో ఆ నివేదిక మీద జరిగిన చర్చలో శ్రీ శంకరన్, శాంతాసిన్హా పాల్గొన్నారు. కల్పన తన నివేదిక ఎందుకో ప్రచురించలేదు. కాపీకూడా మాకు ఇవ్వలేదు.

**స్థానికప్రజల చొరవ పునాది:**

మావోయిస్టులతో ప్రభుత్వం చర్చల (2004) సందర్భంగా విప్లవపార్టీలు 'ఆంధ్రప్రదేశ్‌లో భూపంపిణీ, వ్యవసాయరంగం అభివృద్ధి' అని ఒక పత్రం ప్రవేశపెట్టి 17 నిర్దిష్ట ప్రతిపాదనలు చేశాయి వాటిలో "భూసమస్య పరిష్కార ప్రాతిపదికను కేంద్రస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ పైనుంచి ప్రకటించి అమలు జరపడం కాక నిర్దిష్టంగా గ్రామంలో ప్రజలముందు చర్చల ద్వారా నిర్ణయించాలి. ఏ గ్రామంలో ఎవరికి ఎంత భూమి ఉందో, ఆ భూమి నాణ్యత ఏటువంటిదో, అది కుటుంబ అవసరాలకు సరిపోతుందో లేదో చెప్పగలవారు స్థానికప్రజలు మాత్రమే. కనుక ఏ సాధారణ రెడీమేడ్ గరిష్ట పరిమితులతోనూ, అంచనాలతోనూ కాక స్థానిక చర్చ, స్థానిక ప్రజల చొరవ ఆధారంగా భూసమస్య పరిష్కారాలు చేపట్టాలి" ('కళ్ళముందరి చరిత్ర' 2008 పుట.170). ఇదేమీ అపూర్వమైన ప్రతిపాదనకాదు. ప్రజలముందుకు తీసుకుపోతే ప్రభుత్వం చచ్చినట్లు ఒప్పుకొనేది. కాని చివరకు జరిగిందేమిటి! కోనేరు రంగారావు కమిటీ, గిర్‌గ్లాని రిపోర్ట్‌లు తయారు చేయించి అప్పుడప్పుడు గొప్పలు గోతులతో నిండిన భూములు పంచిపెడుతుంది. చివరకు 'ఈ చర్చలలో మేం భూసమస్య ఎత్తినందువల్లే కదా ఈ మాత్రమన్నా పంచుతున్నారు' ('24 గంటలు' పుట.175) అని ఊరట పొందవలసి వచ్చింది. భూసమస్యల్లో పనిచేసిన ఎందరో కార్యకర్తలను కూడగట్టి ఈ మధ్యవర్తులు ప్రభుత్వాన్ని ఒప్పిస్తే బాగుండేది.

**భూములు పంచకపోవడంకూడా అత్యాచారమే:**

సాధారణంగా షెడ్యూలు జాతుల తెగలమీద అత్యాచార నిరోధకచట్టంకింద (1989) కులం పేరిట దూషించారనో – లేక అత్యాచారం చేశారనో క్రిమినల్ కేసులు పెడుతుంటారు. '24గంటలు' లో కనబిరాన్ రాష్ట్రంలో దళితులమీద జరిగిన అత్యాచారాలు, ఉద్యమాలు ఈ చట్టంలోగల అవకాశం సుదీర్ఘంగా చర్చించారు. కాని వారికి దక్కవలసిన భూములు పంచకపోవడంకూడా అత్యాచారమే. పంచకపోగా పశ్చిమగోదావరి జిల్లాలో గిరిజనులమీద దాడులకు కూడా దిగారు. జాతీయ మానవహక్కుల కమీషన్‌కు పశ్చిమగోదావరి గిరిజనులీద జరిగిన అత్యాచారాలమీద ఫిర్యాదు చేశాం. మూడేళ్ళ తరువాత ఆ ఫిర్యాదు శ్రీశంకరన్ అభిప్రాయం కోసం పంపారు. ఆయన జరిగిన ఆలస్యానికి కమీషన్‌ను మందలిస్తూ, ఈ విషయంలో న్యాయమూర్తి కీ.శే. బి.ఎ.యస్.స్వామి ఉత్తర్వులు (సి.సి. నెం.1381/97 ది.2-1-1998) అమలు జరిపి, అత్యాచారాలకు పాల్పడినవారిమీద అత్యాచార నిరోధకచట్టం కింద ప్రత్యేక అధికారిని నియమించి విచారణ జరపవలసిందిగా నివేదిక పంపారు. కమీషన్ ఆ నివేదిక బుట్టదాఖలు చేసింది. ఈలోగా ఈ చట్టం ప్రకారం ఒక అధికారిని నియమించి విచారణ జరపండి అని 1997లో హైకోర్టులో పిటీషన్ వేశాం. ఉదాహరణగా భూములనుండి తొలగింపు ఉత్తర్వులిచ్చినప్పటికీ ఏదో ఉత్తర్వు కోర్టునుండి సంపాదిస్తూ భూమిలో కొనసాగుతున్న జీలుగుమిల్లి మండలం నరుసుగూడెం పొలాలవిషయం పిటీషన్‌లో ప్రస్తావించాం. న్యాయస్థానం, ఆ భూమి గిరిజనులకు అప్పచెప్పేదాకా వదల్లేదు. కాని మిగతా సమస్యలకోసం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ దగ్గరకు వెళ్ళవలసిందిగా ఉత్తర్వులిచ్చింది. కాని ఈ కమిషన్‌కు 1989చట్టంలోగల విశేషాధికారాలు (ఒక అధికారిని విచారణకు నియమించడం– ప్రత్యేక కోర్టులు ఏర్పాటు) లేవు. అది ఒక తపాలాఫీసు మాత్రమే. కాబట్టి 1989 చట్టం ప్రకారం మేం న్యాయం అడిగితే – ఆ ఆధికారాలు లేని కమిషన్ దగ్గరకు వెళ్ళమనడం తగదు అంటూ సుప్రీంకోర్టు కెళ్ళాం. సుప్రీంకోర్టు మా వాదనను అంగీకరించి ప్రత్యేకాధికారిని నియమించవలసిందిగా ఆదేశాలిచింది (స్పెషల్‌లీవ్ పిటీషన్ సివిల్ నెం.6942/2005, ఉత్తర్వు తేదీ:ఏప్రిల్ 24, 2009). అయితే ధైర్యంగలవాళ్ళు భూముల్లాక్కున్నారు/ లాక్కుంటున్నారు. ఆ ఊళ్ళకెళ్ళి ఎవరినీ అరెస్టుచేసే దమ్ములు ఈ నాటికీ పోలీసులకు లేవు. పోలీసులకు దొరకనివాళ్ళ ఓటుహక్కు రద్దుచేయాలనే వ్యూహం బెడిసి కొట్టింది. పెట్టిన కేసుల్లోకూడా వాయిదాలకు ఎవరూ వెళ్ళడంలేదు. కాని ఆక్రమించుకున్న భూములకు పట్టాలు సంపాదించుకుని పోరాటం చేసినవారితో తగాదాకు దిగే దళారీలు వాళ్ళతోనే బయలుదేరారు. వీరి తరఫున కొందరు హక్కులసంఘాలవారుకూడా వకాలత్ తీసుకున్నారు. ఇటువంటి దళారీలను ఎదుర్కోడానికి వాళ్ళు తటపటాయిస్తున్నారు. ఈ 'విషాదయోగం'నుండి వాళ్ళు బయటపడి, మళ్ళీ ఉద్యమం ఊపందుకుంటే అప్పుడు ఈ ఉత్తర్వులను పైకి

తీద్దాం అని అధికారి నియామకానికి మేం పట్టుపట్టలేదు.

రివెన్యూ, అటవీశాఖలు తప్పుడు రికార్డులు సృష్టించి భూస్వాములను తయారుచేస్తాయి. ఈ వనరులకు ప్రభుత్వం నీటి సౌకర్యం కల్పిస్తుంది. ఆ ఉత్పత్తులద్వారా సంపాదించినవారు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలుగా మారతారు. ఆదాయపు పన్నునుండి తప్పించుకుంటారు. అసలు దొంగలు ఈ ప్రభుత్వశాఖలు, వాళ్ళు తయారుచేసిన భూస్వాములు, పెట్టుబడిదారులు. వీళ్ళందరి ఆస్తులు కాపలా కాయడానికి పోలీసులు రంగప్రవేశం చేస్తారు. కాబట్టి పోలీసులను ఏకాకిని చేయాలంటే పరిపాలనగూర్చి కనీస అవగాహన ప్రజలబుర్రలోకెక్కించాలి. భూపరిమితి చట్టం ప్రకారం 1970లో ఒక కుటుంబానికి 25 ఎకరాల పల్లంకాని, 40 ఎకరాల మెట్టకాని ఉండాలి. అంటే ఆనాటి ఆసామి తన సంతానానికి భూమి పంచితే, ఇవేళ వాళ్ళదగ్గర 5-6 ఎకరాలకు మించి భూమి ఉండకూడదు. ఈ నమ్మకంతో చేసే పోరాటాలకు భూస్వాములు, సాయుధబలగాలు, ఆఖరుకు న్యాయస్థానాలు కంగుతినక తప్పదు. ఆ కృషికి పూనుకోనంతవరకూ మనకు మిగిలేది కళాకారుల, కవుల ఆటపాటలు, అమరవీరుల ఆర్తనాదాలు మత్రమే.

********************

'శాస్త్రేషు హీనాః కవయో భవంతి,
కవిత్వ హీనాశ్చ పురాణభట్టాః,
పురాణ హీనాశ్చ కృషీవలాస్యుః,
భగ్నాత్ కృషే భాగవతాః భవంతి'

'శాస్త్రం (విషయం) తెలియనివాడు కవి అవుతాడు  కవిత్వం చేతకానివాడు పరిశోధకుడు అవుతాడు  అదీ చేతకానివాడు